క్లుప్తంగా

నేడు గీతాముఖర్జీ నగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు (న్యూటౌన్‌): కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 38వ వార్డు గీతాముఖర్జీ నగర్‌లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్‌ జరదొడ్డి సుధాకర్‌ హాజరుకానున్నట్లు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

గడివేముల: మండల పరిధిలోని ఆయా గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలని తహసీల్దార్‌ శ్రీనివాసులు సూచించారు. స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్‌ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీని అధికారులు పరిశీలించి తగు న్యాయం చేయాలన్నారు. రైతులు, విద్యార్థులు, ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోవద్దని సూచించారు. మండలంలో రెవెన్యూ సమస్యలు లేకుండా చూడాలని ఆయన వీఆర్వోలకు సూచించారు. డిప్యూటీ తహసీల్దార్‌ మాధవ, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

31న మండల సర్వసభ్య సమావేశం

పాణ్యం: ఈనెల 31న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలన్నారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికను నిర్ణీత గడువులోగా పంపాలన్నారు. సమావేశానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌ రెడ్డి హాజరవుతారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఓర్వకల్లు: మండల పరిధిలోని నన్నూరు వద్ద జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఘటనకు సంబంధించిన వివరాలు.. నన్నూరు గ్రామానికి చెందిన వెంకటరాముడు ఏపీ 39 ఓఎస్‌ 1498 నంబర్‌ గల బైక్‌పై కర్నూలుకు బయలుదేరాడు. అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ఏపీ 39 కేఎన్‌ 5792 నంబర్‌ గల ఎక్స్‌ఎల్‌ బైక్‌పై కర్నూలు నుంచి నన్నూరు వైపు వ్యతిరేక మార్గంలో వెళుతుండగా మార్గమధ్యంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో వెంకటరాముడు తలకు బలమైన రక్తగాయం కాగా, వెంకటేశ్వర్లు చేతి వేలికి రక్తగాయమైంది. విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది గాయపడిన వారిని అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లోడర్, జేసీబీ కొనుగోలుకు నిధుల మంజూరు

కర్నూలు (టౌన్‌): కర్నూలు నగర పాలక సంస్థకు ప్రజా అవసరాల కోసం లోడర్, హిటాచీ (జేసీబీ) కొనుగోలుకు నంద్యాల ఎంపీ ల్యాడ్స్‌ నుంచి నిధులు మంజూరయ్యాయి. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌ రెడ్డి విన్నపం మేరకు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి స్పందించి తన ఎంపీ ల్యాడ్స్‌ నిధుల నుంచి రూ.37.50 లక్షలు కేటాయించారు. సోమవారం ఆ నిధులకు సంబంధించి పరిపాలన అనుమతులు మంజూరైనట్లు నగరపాలక అధికారులు తెలిపారు.

బాలికలపై వివక్ష చూపొద్దు

కర్నూలు(హాస్పిటల్‌): సమాజంలో బాలికల పట్ల వివక్ష చూపకూడదని జిల్లా ఇమ్యునైజేషన్‌ అధికారి డాక్టర్‌ వై. ప్రవీణ్‌కుమార్‌ చెప్పారు. సోమవారం గార్గేయపురం గ్రామంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో బేటి పడావో–బేటి బచావో కార్యక్రమంలో డాక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌ పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత కాలంలో బాలురతో సమానంగా బాలికలు విజయాలు సాధిస్తున్నారని, స్త్రీ లేకపోతే సృష్టి లేదన్నారు. అనంతరం బేటి బచావో–బేటి పడావో పోస్టర్‌లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారిణి డాక్టర్‌ విజయలక్ష్మి, హెడ్‌ మాస్టర్‌ వెంకటరాముడు, ఎంపీహెచ్‌ఈఓ వెంకటరమణలతో కలిసి ఆవిష్కరించారు.

25న బస్సు యాత్ర కర్నూలుకు రాక

కర్నూలు(సెంట్రల్‌): ఏపీకి ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలను నెరవేర్చాలని డిమాండ్‌ చేస్తూ విద్యార్థి సంఘాలు చేపట్టిన బస్సు యాత్ర 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కర్నూలు చేరుకోనున్నది. సోమవారం కలెక్టరేట్‌లోని మీడియా భవన్‌ ఎదుట డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఏఐవైఎఫ్‌ నగర కార్యదర్శి బీసన్న యాత్రకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వై.నగేష్‌ మాట్లాడుతూ..2014లో అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదాను ఇస్తామన్న మోదీ, ఆ తర్వాత మాట తప్పారన్నారు. అలాగే కడపలో ఉక్కు పరిశ్రమ, వైజాగ్‌లో రైల్వేజోన్, ఇతర ప్రధాన డిమాండ్లను నెరవేర్చలేదన్నారు. వాటి సాధనకు విద్యార్థి, యువజనసంఘాల ఆధ్వర్యంలో పోరుబాటపట్టినట్లు చెప్పారు.

ప్రతి గడపకూ సంక్షేమ లబ్ధి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌ రెడ్డి
- కొంగనపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- ఆత్మీయంగా స్వాగతం పలికిన ప్రజలు


కొంగనపాడు గ్రామంలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్‌ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌ రెడ్డి

కల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలతో ప్రతి గడపకూ లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు మండలం కొంగనపాడు గ్రామంలో సర్పంచ్‌ సువర్ణమ్మ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌ కేశవరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను, వృద్ధులను అప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే ముందుకు సాగారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామంలో ఎమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయలన్నారు. సమస్యలు పరిష్కారించడానికి గడప గడపకూ వస్తున్నామన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో జనరంజక పాలన అందిస్తున్నామన్నారు. అర్హులైన వారికి వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తున్నామని, పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే జమ చేస్తున్నామని వివరించారు. ఎక్కడా మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేదన్నారు.

ఇంటి వద్దకే పథకాలు

రాజకీయాలకు, వర్గాలకు, కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్నామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. గత టీడీపీ పాలనలో పథకాల కోసం జన్మభూమి కమిటీల సిఫారసుతో పాటు నాయకుల అండదండలు కావాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదన్నారు. గత టీడీపీ పాలనకు, సీఎం జగనన్న అందిస్తున్న పాలనలో తేడాను ప్రజలు గమనించాలన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయ ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్‌ కల్లా వెంకట రమణారెడ్డి, జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు–2 చంద్రశేఖర్‌రెడ్డి, సల్కాపురం, చెట్లమలాపురం సర్పంచ్‌లు మద్దిలేటి, ఎస్‌.భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు ఇప్పల నారాయణరెడ్డి, దండు లక్ష్మికాంతరెడ్డి, నాయకులు పెద్ద ఈశ్వరయ్య, హనుమంతురెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, తిమ్మన్న, లక్ష్మన్న, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు


మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న ఏపీ కస్తూర్బా గాంధీ పాఠశాలలో నంద్యాల జిల్లా ఇండియన్‌ రెడ్‌క్రాస్‌ ఆధ్వర్యంలో బాలికల దినోత్సవం సందర్భంగా సోమవారం మెడికల్‌ క్యాంప్‌ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ కోటయ్య, రెడ్‌క్రాస్‌ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్‌ వైస్‌ చైర్మన్‌ మారుతికుమార్‌ మాట్లాడుతూ.. పాఠశాలలోని విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించి వారి గ్రూప్‌ వివరాలు తెలియజేశామన్నారు. వసతి గృహంలో ఉండే విద్యార్థులకు అత్యవసర సమయంలో ఉపయోగపడే మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇన్‌చార్జ్‌ ప్రిన్సిపాల్‌ కళ్యాణి, రెడ్‌క్రాస్‌ సభ్యులు నాగేశ్వరరావు, మద్దిలేటి, ఉస్మాన్, శారద, విజయ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామ స్వరాజ్యం


కొంగనపాడు గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- రైతుల అభివృద్ధే లక్ష్యంగా జగనన్న పాలన
- కొంగనపాడులో సచివాలయం, ఆర్‌బీకే భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీతోనే మహాత్మా గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కొంగనపాడులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే, కర్నూలు డివిజన్‌ వ్యవసాయ సహాయ సంచాలకులు సాలు రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భవనాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలు స్థానికంగా అందించాలనే లక్ష్యంతో ఊరురా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలకు అవసరమైన 500 పైగా సేవలను గ్రామ సచివాలయాల ద్వారా అందుతున్నాయన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి

ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో రైతన్నల అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. పంటల సాగులో పెట్టుబడి ఖర్చులకు ఇబ్బంది లేకుండా ఖరీఫ్‌ ప్రారంభంలోనే రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. స్థానికంగానే రైతులకు కావాల్సినవన్నీ లభిస్తుండడంతో వారికి వ్యయ ప్రయాసలు, ప్రయాణ ఖర్చులు తగ్గి సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌ సువర్ణమ్మ, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్‌ కేశవరెడ్డి, ఎంపీటీసీ అశోక్‌వర్ధన్‌రెడ్డి, మండల నాయకులు, ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, పీఆర్‌ ఏఈ అచ్యుతానంద రెడ్డి, ఏఓ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి, ఆర్‌ఐ లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్‌


ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్‌ సుధాకర్‌

- ఎమ్మెల్యే డాక్టర్‌ సుధాకర్‌
- గూడూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

గూడూరు: పేదల పక్షపాతి సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్‌ సుధాకర్‌ అన్నారు. సోమవారం పట్టణంలోని తూర్పు బీసీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి అహర్నిషలు కష్టపడుతున్నాడని కొనియాడారు. పేదల కోసమే వైఎస్సార్‌ ఆసరా, చేయూత, వంటి పథకాలు తీసుకొచ్చాడన్నారు. గడప దాటకుండా ప్రభుత్వ పథకాలు ఇంటి వద్దకే చేర్చుతున్నారని వివరించారు. సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి దేశంలోనే ఆదర్శంగా ఏపీని నిలబెట్టాడని కొనియాడారు. మున్సిపల్‌ చైర్మన్‌ జులపాల వెంకటేశ్వర్లు, వైస్‌ చైర్మన్‌ బోయ లక్ష్మన్న, సచివాలయాల కన్వీనర్‌ ఎల్‌.వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ కన్వీనర్‌ జే.ఆబేలు, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌ ఎస్‌ఏ జిలానీ, మున్సిపల్‌ కౌన్సిలర్లు ఖలీల్, కలాం, దస్తగిరి, నంద కిషోర్, మద్ది, కిషోర్, మున్సిపల్‌ ఏఈ నరసింహమూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి

కర్నూలు (న్యూటౌన్‌): ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని కర్నూలు ఎంపీ డాక్టర్‌ సింగరి సంజీవ్‌కుమార్‌ సూచించారు.ఆయన సోమవారం కర్నూలు మండలం బీ తాండ్రపాడు గ్రామంలో సేవ్‌ నేచర్‌ అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నర్సరీలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో అవసరమని అన్నారు. రసాయన క్రిమీసంహారక మందులు వాడితే భూమిలో సారవంతం పూర్తిగా తగ్గిపోతుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తే భూములు సారవంతంగా మారి పంటలు సమృద్ధిగా పండుతాయన్నారు. బీ తాండ్రపాడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బీ తాండ్రపాడు నర్సరీలో భూమి పూజ చేస్తున్న ఎంపీ డాక్టర్‌ సింగరి సంజీవ్‌కుమార్‌ →



దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు


ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న వైద్యుడు వీరేష్‌

సి.బెళగల్‌: స్థానిక భవితా కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ప్రతి సోమవారం నిర్వహించే ఫిజియోథెరపీలో భాగంగా పది మందికి సేవలందించినట్లు ఎంఈఓ జ్యోతి తెలిపారు. సోమవారం స్థానిక భవితా కేంద్రంలో దివ్యాంగులకు ఫిజియోథెరపీని వైద్యుడు వీరేష్‌ నిర్వహించారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఎంఈఓ వైద్యుడిని అడిగి దివ్యాంగుల వైద్య విధానాల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎంఈఓ దివ్యాంగుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగ చిన్నారుల కోసం ప్రత్యేక వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగులకు బాల్, పాడ్స్‌ తదితర పరికరాలపై ముడుచుకుపోయిన కాళ్లకు, చేతులకు డాక్టర్‌ వ్యాయామం చేయించారు. డాక్టర్‌ మాట్లాడుతూ తాము చేయించిన వ్యాయామంను ఇంటి దగ్గర కూడా చేయించాలని దివ్యాంగుల తల్లిదండ్రులకు సూచించారు. దివ్యాంగ చిన్నారులకు ఐఈఆర్‌టీలు మద్దిలేటి, సోమశేఖర్‌ రెడ్డి ప్రత్యేక పరికరాలతో విద్యను అందించారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి


పెసరవాయి గ్రామంలో మంచానికి పరిమితమైన రోగికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్‌ మొల్లా జబీన్‌

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్‌ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్‌ మొల్లా జబీన్‌ సూచించారు. సోమవారం మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్‌ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సచివాలయం ఆవరణలో గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో మంచానికే పరిమితమైన రోగులకు వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్‌ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి


సి.బెళగల్‌ కేజీబీవీ విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ వరలక్ష్మిదేవమ్మ

సి.బెళగల్‌: కౌమార దశలో ఉండే బాలికలు పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని కోడుమూరు ప్రాజెక్ట్‌ సీడీపీఓ వరలక్ష్మి దేవమ్మ అన్నారు. సోమవారం స్థానిక కస్తూరిబా బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఎస్‌ఓ జ్యోతి అధ్యక్షతన జాతీయ బాలికల వారోత్సవాలలో సందర్భంగా పాఠశాల విద్యార్థినులకు మండల ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్లు పద్మావతి, మల్లేశ్వరి ఆరోగ్య అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ బాలికలకు బాల్య వివాహాలు, రక్తహీనత, వ్యక్తిగత శుభ్రత, రుతుస్రావ సమస్యలపై అవగాహన కల్పించి వారిని ఆయా అంశాలపై పరీక్షించి ఆరోగ్య అంశాలను తెలియజేసిన బాలికలకు బహుమతులను ప్రధానం చేశారు. సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, జరీనాబాను, అంగన్‌వాడీ, పాఠశాల టీచర్లు తదితరులు ఉన్నారు.

వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం


గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్య వైశ్య సంఘం నాయకులు

గడివేముల: మండల కేంద్రంలోని అమ్మవారి శాలలో సోమవారం నాడు వాసవీ మాత ఆత్మార్పణ దినం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయం నుంచి ఆర్యవైశ్య ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి అమ్మవారి శాలకు చేరుకున్నారు. ఆలయ అర్చకులు సత్యనారాయణ శర్మ ఉదయం సుప్రభాతం, క్షీరాభిషేకం, ఫల పంచామృతాభిషేకం చేసిన అనంతరం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వాసవీమాత అష్టోత్తర శతనామావళి కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. వాసవీ మాత ఆత్మార్పణ మహోత్సవ యాగం(యజ్ఞం) నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆర్యవైశ్య వర్గీయులు పాల్గొన్నారు.

గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి


నందనపల్లెలో భూముల రీసర్వే చేస్తున్న వీఆర్‌ఓ, గ్రామ సర్వే సహాయకులు

కర్నూలు (న్యూటౌన్‌): ప్రభుత్వం విధించిన గడువులోగా భూముల రీసర్వే పూర్తి చేయాలని కర్నూలు రూరల్‌ ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ శివరాముడు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలు మండలం సుంకేసుల నుంచి గార్గేయపురం వరకు భూముల రీసర్వే పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. కర్నూలు మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో దండోరా వేయించి సర్వేపై రైతులకు ముందుగానే సమాచారం ఇవ్వాలని సూచించారు. వీఆర్‌ఓలు, గ్రామ సర్వే సహాయకులు టీమ్‌లుగా ఏర్పడి భూములను రీ సర్వే చేస్తున్నట్లు చెప్పారు. ఫీల్డ్‌ సర్వే పూర్తయితే తర్వాత ల్యాండ్‌ పార్సల్‌ మ్యాప్‌ (ఎల్‌పీఎం) రైతులకు అందజేస్తామన్నారు. తర్వాత డ్రోన్‌ కెమెరాలతో సర్వే పూర్తి చేస్తామన్నారు. ఫీల్డ్‌ సర్వే, డ్రోన్‌ సర్వే రెండింటినీ ట్యాలీ చేసుకుంటామని, హెచ్చుతగ్గులుంటే మళ్లీ ఫీల్డ్‌ సర్వే చేస్తామని స్పష్టం చేశారు. సోమవారం మండల పరిధిలో 41836.65 ఎకరాలు సర్వే పూర్తయిందన్నారు. సర్వేలో వీఆర్‌ఓలు, గ్రామ సర్వే సహాయకులు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

26న కళాశాల విద్యార్థుల సాంఘిక్‌

కర్నూలు కల్చరల్‌: రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్‌ (ఆర్‌ఎస్‌ఎస్‌) కళాశాల విద్యార్థుల సాంఘిక్‌ను ఈనెల 26వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఏక్యాంప్‌ మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్‌ నగర సంఘచాలక్‌ సూరా వెంకటరెడ్డి తెలిపారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాల ఈసీఈ హెచ్‌ఓడీ డాక్టర్‌ ఎస్‌.నాగరాజు రావు ముఖ్య అతిథిగా, ఆర్‌ఎస్‌ఎస్‌ ప్రాంత సహకార్యవాహ దువ్వూరి యుగంధర్‌ ప్రధాన వక్తగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలి


పాణ్యం డిగ్రీ కళాశాలలో నేతాజీకి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

పాణ్యం: ఆజాద్‌ హిందు ఫౌజ్‌ వ్యవస్థాపకులు, నేతాజీ సుభాష్‌ చంద్రబోష్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పాణ్యం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ హనుమంతరావు పిలుపునిచ్చారు. సోమవారం పాణ్యం డిగ్రీ కళాశాలలో నేతాజీ జయంతి సందర్భంగా.. ఆర్‌వీఎఫ్‌ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ హనుమంతరావు మాట్లాడుతూ.. యువత నేతాజీని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. అనంతరం నేతాజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నేతాజీ స్వాతంత్ర్యం కోసం చూపిన పౌరుషాన్ని ప్రతిఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు.

'స్పందన'పై మండల అధికారుల నిర్లక్ష్యం


సి.బెళగల్‌లో సోమవారం ఉదయం 10:39 గంటలకు స్పందనకు ముగ్గురు అధికారులు మాత్రమే హాజరైన దృశ్యం

సి.బెళగల్‌: మండల కేంద్రం సి.బెళగల్‌లోని తహసీల్దార్‌ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంపై మండల అధికారుల నిర్లక్ష్యపు ధోరణి కొనసాగుతూనే ఉంది. సోమవారం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఉదయం 10:39 గంటల వరకు కేవలం ముగ్గురు (తహసీల్దార్‌ శివశంకర్‌నాయక్, ఎంపీడీఓ రాముడు, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ గోనేనాయక్‌) అధికారులు మాత్రమే హాజరయ్యారు. 11 గంటల అనంతరం ఏఓ మల్లేష్‌ కుమార్, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్లు మల్లేశ్వరి, పద్మావతి, ఇరిగేషన్‌ ఏఈ సూర్యప్రకాష్, ఎంఈఓ జ్యోతి, వైకేపీ ఏపీఎం వెంకటస్వామి, ఉపాధి హామీ ఏపీఓ లక్ష్మన్న హాజరయ్యారు. మిగతా మండల అధికారులైన విద్యుత్, హౌసింగ్‌ ఏఈలు సుకుమార్, సుమంత్, పశువైద్యులు ప్రవీన్, ఈఓఆర్డీ సందీప్, వైద్య అధికారులు తహసీల్దార్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా స్పందనకు గైర్హాజరయ్యారు. స్పందన కార్యక్రమంలో ఆయా గ్రామాల నుంచి పింఛన్, రైస్‌ కార్డు, భూ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అధికారులకు అర్జీలు ఇచ్చారు.

24న కాజ్‌వే నిర్మాణానికి శంకుస్థాపన

కోడుమూరు: గోరంట్ల వద్ద హంద్రీపై కాజ్‌వే నిర్మాణానికి ఈ నెల 24న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌ రెడ్డి శంకుస్థాపన చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. శంకుస్థాపన కార్యక్రమానికి కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, పత్తికొండ, కోడుమూరు, పాణ్యం ఎమ్మెల్యేలు కంగాటి శ్రీదేవి, జె.సుధాకర్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కుడా చైర్మన్‌ కోట్ల హర్షవర్ధన్‌ రెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ బీవై.రామయ్య, జిల్లా కలెక్టర్‌ కోటేశ్వరరావు తదితరులు హాజరుకానున్నారు.

గడ్డివామి దగ్ధం

గూడూరు: మండలంలోని గుడిపాడు గ్రామంలో సోమవారం రాత్రి ప్రహ్లాదరెడ్డి అనే రైతుకు చెందిన గడ్డివామి ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యింది. ప్రమాదంలో రూ.40 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన చెందారు. కోడుమూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసినా అప్పటికే గడ్డివామి పూర్తిగా దగ్ధం అయ్యింది.

